ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 27 ఆగస్టు 2024 | 5

ఇస్కాన్‌లో సందడే సందడి

రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న దృశ్యం - 7లో

అందాల జిల్లాకు పర్యాటక సొగసు!



కడియపులంక కెనాల్‌లో బోట్ షికారు, స్టాల్స్ పర్యాటు నమూనా



- మళ్లీ తెరమీదకు అఖండ గోదావరి ప్రాజెక్టు
- రూ.1000 కోట్లతో రాజమహేంద్రవరం రివర్స్ ఫ్రంట్ అభివృద్ధి
- వచ్చే పుష్కరాల నాటికి గోదావరి ఘాట్ల సుందరీకరణ, విస్తరణ
- కడియం నర్సరీల్లో పర్యాటక కళ
- ఇప్పటికే బోట్ సిద్ధం
- పొట్టిలంక నుంచి కడియపులంక పూలమార్కెట్ వరకూ కెనాల్ బోట్ షికారు
- నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం పంట కాలువలో బోట్ షికార్
- పిచ్చుకలంకలో ఒబెరాయ్ 7 స్టార్ హోటల్
- ఒబెరాయ్ ప్రతినిధులతో కలసి పిచ్చుకలంకను పరిశీలించిన మంత్రి దుర్గేష్

హేవలాక్ బ్రిడ్జి తీర్చిదిద్దేదిలా..



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

అందాల తూర్పుగోదావరి జిల్లాకు పర్యాటక హంగులు రానున్నాయి. గత పుష్కరాల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గోదావరి, దాని పరీవాహక ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి అఖండగోదావరి ప్రాజెక్టును ప్రారంభించిన సంగతిని తెలిసిందే. అప్పట్లో రూ.100 కోట్లు కూడా ప్రకటించారు. రాజమహేంద్రవరంలో అఖండగోదావరి రీజినల్ డైరెక్టర్ (టూరిజం ఆర్డీ) కార్యాలయం కూడా ఏర్పాటుచేశారు. అఖండ గోదావరిలో బోట్ షికారు ప్రారంభించారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొత్తం అఖండ గోదావరి ప్రాజెక్టును ఎత్తివేయడంతోపాటు పర్యాటక రంగాన్నే ధ్వంసం చేసింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పర్యాటక రంగానికి కళ తేనున్నారు. రాష్ట్రపర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ జిల్లాకు చెందినవారే కావడంతో ఈసారి ఇక్కడ పర్యాటక రంగం త్వరగానూ రూపుదిద్దుకుంటుందనే నమ్మకం ప్రజలల్లో ఏర్పడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం మళ్లీ అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపాలని టూరిజం డిపార్ట్‌మెంట్‌ను తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందడానికి ఆస్కారం కనిపిస్తోంది.

● పర్యాటక ప్రాంతంగా కడియం నర్సరీలు

ప్రస్తుతం తక్షణం కడియం నర్సరీలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి ప్రణాళికలు సిద్ధంచేయిస్తున్నారు. ఈనేపథ్యంలో కడియపుంకలో రెండు రూట్లను గుర్తించారు. పర్యాటకులు వరుసగా ఎక్కువ నర్సరీలను సందర్శించే విధంగా ప్రతిపాదన చేశారు. కడియపులంకలో జాతీయ రహదారి నుంచి వరసగా ఒక నర్సరీ నుంచి మరో నర్సరీలోకి సీసీ బాట ఏర్పాట చేయనున్నారు. నర్సరీల ముఖద్వారాల్లో గేట్లు కూడా పెడతారు. సత్యదేవా నర్సరీ నుంచి పరిసర ప్రాంతాల నర్సరీలను సందర్శించే విధంగా మరొక రూట్ సిద్ధం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 6 గంటల వరకూ పర్యాటకులు ఈ ప్రాంతాలను సందర్శించవచ్చు. ఇవి అమలులోకి వచ్చి పర్యాటకులను బాగా ఆకర్షించిన తర్వాత రెండు మూడు రోజులపాటు పర్యాటకులు ఈ ప్రాంతంలోనే ఉండి ఆనందించేటట్టు కాటేజీల నిర్మాణ ప్రతిపాదన కూడా ఉంది. విద్యుత్ బ్యాటరీల సహాయంతో నడచే ఈ-వెహికల్స్‌ను ఏర్పాటుచేసే యోచన ఉంది.



కాటన్ బ్యారేజీపై నుంచి గోదావరి వ్యూ చూస్తున్న మంత్రి, ఒబెరాయ్ ప్రతినిధులు

● కెనాల్ బోట్ షికారు

పొట్టిలంక నుంచి కడియపులంక పూల మార్కెట్ వరకూ కిలోమీటరన్నర దూరం మేర కాలువలో బోట్ షికారు ఏర్పాటుచేయనున్నారు. వీటికోసం హైవేలో మూడు పాయింట్లు గుర్తించనున్నారు. పొట్టిలంకలో బోట్ ఎక్కి కడియపులంక వరకూ రావచ్చు. తిరిగి వెళ్లవచ్చు. మధ్యలో దిగడానికి, ఎక్కడానికి కూడా హైవే వద్ద ఓ పాయింట్ గుర్తించనున్నారు. ఈ బోట్ షికారు కోసం రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే ఓ బోటును ఈ ప్రాంతానికి కేటాయించారు. ప్రస్తుతం అది పాశర్లపూడి రేవులో ఉంది. త్వరలో అధికారులు దీన్ని ఇక్కడకు తేనున్నారు. బోట్ షికారు ప్రారంభించేముందు కాలువకు రెండు వైపులా బ్యూటిఫికేషన్ చేయనున్నారు. ఇక్కడ 20 షాపులు నిర్మించడానికి కూడా అనువైన స్థలం కోసం ఆరా తీస్తున్నారు. ఇటువంటి ప్రతిపాదన నిడదవోలులో కూడా ఉంది. నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్లే పంట కాలువలో కిలోమీటన్నర దూరం బోట్‌షికారు పెట్టే ఆలోచన కూడా ఉంది.

● పిచ్చుకలంకలో ఒబెరాయ్ 7స్టార్ హోటల్

ధవళేశ్వరం బ్యారేజీ పక్కన ఉన్న పిచ్చుకలంకలో ఒబెరాయ్ సంస్థ 7 స్టార్ హోటల్ నిర్మించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. సోమవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలసి ఒబెరాయ్ కంపెనీ ప్రతినిధులు పిచుకలంకను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

● రూ.1000 కోట్లతో రివర్‌ఫ్రంట్ టూరిజం


రాజమహేంద్రవరంలో అన్ని గోదావరి ఘాట్లను అందంగా తీర్చిదిద్దడంతోపాటు విస్తరించడానికి, హేవలాక్ బ్రిడ్జి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడానికి, నగరంలోని ముఖ్యప్రాంతాలు, స్థలాలు వంటి వాటిని అభివృద్ధి చేయడానికి, అఖండ గోదావరిలో ఇసుక లంకలను కూడా పర్యాటక రంగంలో అభివృద్ధి చేసే ప్రతిపాదనలు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.20 కోట్లు శాంక్షన్ కాగా, రూ.8 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వచ్చే పుష్కరాల నాటికి వెయ్యి కోట్లు వెచ్చించే లక్ష్యంతో ఆలోచనలు చేస్తున్నారు.

పిచ్చుకలంకలో ఒబెరాయ్

7స్టార్ హోటల్ నిర్మాణం కోసం

మంత్రి దుర్గేష్, ఒబెరాయ్ ప్రతినిధుల పర్యటన

పిచ్చుకలంక కల నెరవేరనున్నదా? అనే ప్రశ్నకు అవుననే సమాధానం వినవస్తోంది. దశాబ్దాల కిందటే టీడీపీ సీనియర్ నేత, ప్రస్తుతం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఈ లంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడం కోసం శంకుస్థాపన చేశారు. ఇప్పటికే శిలాఫలకం ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉంది. కానీ ధవళేశ్వరం బ్యారేజీ పక్కన ఉండడంతో రాజమహేంద్రవరానికి అనుసంధానం చేస్తూ ఇక్కడ పర్యాటక అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నారు. 2019 వరకూ అధికారంలో ఉన్న తెలుగుదేశం హయాంలో పిచుకలంకను మెరక చేశారు. తర్వాత వైసీపీ వదిలేసింది. తిరిగి తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే మళ్లీ దృష్టి పెట్టారు. సోమవారం రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బండారు సత్యానందం, ఒబెరాయ్ గ్రూప్స్ వైస్ ప్రెసిడెంట్ శంకర్, ఆర్కిటెక్ వినోద్ గోస్వామి తదితరులతో కూడిన బృందం స్వయంగా ఇక్కడ పరిశీలించింది. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, బండారు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జనసేన నేత బండారు శ్రీనివాసరావు, టూరిజం ఆర్‌డి స్వామినాయుడు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం నగరం నుంచి రివర్ వ్యూ

ఈ క్రాప్ నమోదు, జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్ పూర్తిచేయాలి

టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 26 : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం ఈ-క్రాప్ నమోదు, జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని.. అందుకు డివిజన్, మండల స్థాయి అధికారులు గ్రామ స్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఖరీఫ్ సీజన్ ఈ-క్రాప్ నమోదు, జాయింట్ ఎల్‌పీఎంపై జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులతో కలెక్టరు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో పంట నమోదు 60 శాతం పూర్తయిందని, ఈ-క్రాప్ నమోదుకు సెప్టెంబరు 15 వరకు మాత్రమే సమయం ఉన్నందున ఈలోగా పంట వివరాలు నమోదు పూర్తిచేయాలన్నారు. ఈ-పంట నమోదు పూర్తి చేయడంలో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ అధికారులు వాటి నిర్ధారణ (ప్రమాణీకరణ) చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 60.24 శాతం నిర్ధారణ చేసినట్టు తెలిపారు. ఈ పంట నమోదులో 60 శాతంకంటే తక్కువచేసిన వాటిలో సీతానగరం, రాజానగరం, దేవరపల్లి, కోరుకొండ, నల్లజర్ల, కడియం మండలాలు ఉన్నాయన్నారు. పంటనష్టం సబ్సిడీ తదితర ప్రభుత్వ ప్రోత్సాహకాలు రైతులు పొందేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అన్న విషయాన్ని ఇప్పటికే పలుమార్లు చెప్పడం జరిగిందన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలతోపాటు రైతుల ద్వారా ప్రమాణీకరణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు కేవలం 7.8 శాతం మంది రైతులు ఆ మేరకు ధ్రువీకరణ చేశారని, మిగిలిన వారితో కూడా సమాంతరంగా లక్ష్యాలు సాధించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్, మండల స్థాయి అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టంచేశారు. జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్‌కు సంబంధించి 271 గ్రామాలకుగాను 183 గ్రామాల్లో 11,469 హెక్టార్ల విస్తీర్ణంలో 31,395 ల్యాండ్ రికార్డులు నవీకరించాల్సిఉండగా 6643 (21 శాతం) పూర్తి చేశారన్నారు. నల్లజర్ల, రాజానగరం, ఉండ్రాజవరం, చాగల్లులలో పదిశాతంలోపు ఉండగా, దేవరపల్లి సీతానగరం, నిడదవోలు, గోకవరం మండలాల్లో అత్యధిక గణన పూర్తి చేశారన్నారు. రికార్డులపరంగా రాజానగరం 5115, కోరుకొండ 7049, బిక్కవోలు 4191 భూ వివరాలను నవీకరించాల్సి ఉందన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆ మేరకు లక్ష్యాలను వచ్చే నెల మొదటివారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవోలు కేఎల్ శివజ్యోతి, ఆర్.కృష్ణనాయక్, జిల్లా వ్యవసాయఅధికారి ఎస్.మాధవరావు, హార్టికల్చర్ అధికారి బి.సుజాత, మండల అధికారులు పాల్గొన్నారు.





గోపాలనగర్ పుంత రోడ్డులోని శ్రీకృష్ణస్వామి దేవస్థానంలో ఎంపీ పురందేశ్వరి పూజలు చేస్తున్న దృశ్యం.. గోపిక, కృష్ణ వేషధారులతో ఉన్న చిన్నారులతో ఎంపీ పురందేశ్వరి ముచ్చట గొలిపే చిత్రం

ఫలితాన్ని ఆశించకుండా ధర్మాన్ని కాపాడాలి

కృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/కల్చరల్, ఆగస్టు 26: కృష్ణాష్టమి స్ఫూర్తి, బాధ్యత అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని, ఫలితాన్ని ఆశించకుండా ధర్మాన్ని కాపాడాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం కృష్ణాష్టమి వేడుకలు రాజమహేంద్రవరంలో పలుచోట్ల ఘనంగా జరిగాయి. గోపాలనగర్ పుంతరోడ్డులోని శ్రీకృష్ణ స్వామి వారి దేవస్థానం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితర ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పురందేశ్వరి కృష్ణయ్యస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కోలాటాన్ని ఎంపీ తిలకించారు. గోపిక, కృష్ణ వేషధారణలతో వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఫక్కుర్తి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కలశస్థాపన, మంత్రపుష్పం, దీపారాధన చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, బొమ్ముల దత్తు, తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పురందేశ్వరి రాజమహేంద్రవరం అద్దేపల్లి కాలనీలోని శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ ఉన్న గోవుల సంరక్షణ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత చిన్నారి గోపికలతో ముచ్చటించి వారితో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు కూడా పాల్గొన్నారు.

సీనరేజి వసూలు మొదలైంది!

- గతంలో మాదిరిగానే ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల చెక్‌పోస్టులు
- దోపిడీ లేకుండా అధికారికంగానే వసూలు చేసేటట్టు చర్యలు
- ప్రభుత్వాదాయానికి గండి కొట్టకుండా నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మైన్స్ సీనరేజీ వసూళ్లు మొదలయ్యాయి. ప్రభుత్వాదాయానికి గండిపడకుండా మైన్స్ సీనరేజీ ద్వారా నేరుగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేటట్టు ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. గత ప్రభుత్వంలో సీనరేజీ వసూలు చేసిన సుధాకర్ ఇన్‌ఫ్రాకు వచ్చే ఏప్రిల్ వరకూ గడువు ఉంది. ఈనేపథ్యంలో అదే సంస్థకు సీనరేజీ వసూళ్ల బాధ్యతను అప్పగించింది. కానీ ఈ సంస్థ వద్ద ఏఎంఆర్ అనే సంస్థకు సబ్‌లీజుకు తీసుకుని వసూలు మొదలు పెట్టినట్టు చెబుతున్నారు. జిల్లాలో బిల్డింగ్ మెటీరియల్, గ్రావెల్, లేటరైట్, సుద్దగనులు వంటి అనేక గనులు ఉన్న సంగతి తెలిసిందే. దీనికి గతంలో మైన్స్ అధికారులే నేరుగా సీనరేజీ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించేవారు. కానీ అప్పట్లో కొందరు మైన్స్‌లీజుదారులు, అధికారులు కుమ్మక్కయి బిల్లులు లేకుండా చేసి, సీనరేజీ ఎగ్గొట్టేవారు. అయినా ఏడాదికి రూ.కోట్లలోనే ఆదాయం వచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వంలో ఇందులోని లొసుగులు గమనించి, సీనరేజీ వసూళ్లను అధికార్ల నుంచి తప్పించి, జిల్లాల వారీ ప్రైవేట్ సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చిన సంగతి తెలిసిందే. నెలకు సుమారు రూ. 10 కోట్లు ముందుగానే చెల్లించి, తర్వాత ఈ సంస్థ ఎంతైనా వసూలు చేసుకోవచ్చు. దీన్ని అవకాశంగా తీసుకుని వైసీపీకి చెందిన కొందరు మైనింగ్ దోపిడీకి పాల్పడ్డారు. అధికారికంగా వసూలు చేయవలసిన సీనరేజీకంటే ఐదారురెట్లు ఎక్కువ వసూలుచేసి రూ.కోట్లు దోచుకున్నారు. ఇది ప్రజల్లో కూడా బాగా వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. రెండేళ్లకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల మైన్స్ సీనరేజి కింద రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేటట్టు ఒప్పందం పెట్టుకుని రూ.వందలాది కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. పైగా ఎన్నికల ముందు ప్రభుత్వానికి సుమారు రూ.44 కోట్లు బాకీపడింది. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీనరేజీ వసూలు ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం పద్ధతి ప్రకారం సీనరేజీ వసూలు చేయడానికి నిర్ణయించింది. గతంలో మాదిరిగా ఇష్టానుసారం దోపిడీ లేకుండా ప్రతీ క్యూబిక్‌మీటర్, లేదా ప్రతీ టన్ను మెటీరియల్‌కు నేరుగా ప్రభుత్వానికే సీనరేజీ వచ్చేటట్టు ఏర్పాట్లుచేసింది. చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ప్రస్తుతం పాత సంసనే కొనసాగించేటట్టు చేసినట్టు సమాచారం. కానీ సెప్టెంబరు 1 నుంచి వసూలు చేసేటట్టు ఆర్డర్‌లో ఉంది. కానీ ఈనెల 24 నుంచే వసూలు మొదలైనట్టు చెబుతున్నారు. అధికారికంగా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించాలి. ఎవరైనా బిల్లు లేకుండా రోడ్డు మీద దొరికితే, ఓ సూపర్‌వైజర్ వచ్చి ఆన్‌లైన్ బిల్లు ఇచ్చి, డబ్బు కూడా ఆన్‌లైన్ పేమెంట్ చేసుకుంటారు. దీనివల్ల అధికారికంగా నిర్ణయించిన సీనరేజీనే వసూలు చేయవలసి ఉంది. రోడ్ అండ్ బల్లాస్ట్ మెటీరియల్ క్యూబిక్ మీటరుకు రూ.90, టన్నుకు రూ.60 సీనరేజీ చెల్లించాలి. ఆర్డినరీ ఇసుకకు క్యూబిక్ మీటరకు రూ.100, టన్నుకు రూ.60 చెల్లించాలి. క్వార్ట్జ్ టన్నుకు రూ.90, సున్నపురాయి మూడు కేటగిరీలలో ఉంది. లేటరైట్ మెట్రిక్ టన్నుకు నాలుగు రకాలుగా ఉంది. అల్యూమినియంలో ఉపయోగించేది టన్నుకు రూ.200, ఇతర అవసరాలకు ఉపయోగించేది టన్నుకు రూ.100, లైమ్‌స్టోన్ టన్నుకు రూ.90, లైమ్‌షెల్‌కు టన్నుకు రూ.120 వసూలు చేయాలి. ఇలా ఈ ప్రాంతంలో లభ్యమయ్యే వాటికి ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. ఆ ప్రకారమే వసూలుచేయాలి. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వసూళ్లు మొదలయ్యాయి.



రాజమహేంద్రవరం నాలుగో బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన మైనింగ్ చెక్‌పోస్టు

అనపర్తిలో దారుణ హత్య

- భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త
- అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు
- అనపర్తిలో ఘటన

- 7లో



సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

సబ్ కా సాత్, సబ్ కా వికాస్.. ఇదే బీజేపీ విధానం

- ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ
- పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26 : సబ్ కా సాత్, సబ్ కా వికాస్ బీజేపీ విధానం అని బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఎలాంటి అవినీతి మరక లేకుండా ప్రజాహితంగా, రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా స్థాయి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పురందేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు జరగడం సర్వసాధారణమని, రాష్ట్రంలో ఆరు సంవత్సరాలకు ఒకసారి సంపూర్ణంగా మళ్లీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. 2014లో భారతీయ జనతా పార్టీ 11 కోట్ల మంది కొత్త సభ్యులను నమోదు చేసి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు. చైనాలో కమ్యూనిస్టు పార్టీ 9 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలో పెద్ద పార్టీగా ఉండేదని, దాన్ని బీజేపీ అధిగమించిందని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 18 కోట్ల మంది పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. రాష్ట్రంలో 2014లో 28 లక్షలకు పైగా సభ్యత్వం తీసుకోగా, 2019లో మరో 8 లక్షల మందికి పైగా నమోదయ్యారని వివరించారు. ఇప్పుడు కూడా పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేయడంలో కార్యకర్తలు కృషి చేస్తారని అన్నారు. సీఏఏ, ట్రిపుల్ తలాక్ రద్దు, వక్ఫ్‌బోర్డు సవరణలు వంటి అనేక నిర్ణయాలను బీజేపీ ప్రభుత్వం తీసుకుందని పురందేశ్వరి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పురందేశ్వరి ముఖ్య నాయకులతో సభ్యత్వాల నమోదుపై అంతర్గత సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

హల్‌చల్



మోతుగూడెంలో కింగ్ కోబ్రా

డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలోని ఏపీ జెన్‌కో ఆసుపత్రిలో కింగ్ కోబ్రా కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు వాచ్‌మన్ సురేష్ బయట వరండాలో లైటు వేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో సుమారు 12 అడుగుల కింగ్ కోబ్రా పాత ఓపీ గదిలోకి ప్రవేశించింది.దీంతో భయపడ్డ వాచ్‌మన్ ఆ గది తలుపులు మూసేసి విషయాన్ని మేనేజ్‌మెంట్‌కు తెలపగా వారు అటవీ శాఖ సిబ్బందికి ఫోను చేసి చెప్పారు. అరగంటలో బీట్ ఆఫీసర్లు వచ్చారు. అయితే పాత ఓపీ రూములోంచి కింగ్ కోబ్రా వరండా ద్వారా బయటకు ఎటెళ్లిందో తెలియలేదు.

- మోతుగూడెం

ముమ్మిడివరంలో నల్ల త్రాచు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం నగర పంచాయతీ కొండాలమ్మ చింత సమీపంలో పాస్టర్ ఎలెక్స్ నివాసంలో సోమవారం ఒక ట్రంకు పెట్టెలోకి నల్ల తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. దీంతో ఆ ఇంట్లోని వారు, చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. పాస్టర్ ఎలెక్స్ స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టి డబ్బాలో బంధించారు. దానిని నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెడతానని గణేష్ వర్మ చెప్పారు.

-ముమ్మిడివరం





రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం సమీపంలో ఉట్టి ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు



రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో రాధాగోపీనాథులు



కాకినాడ మధురానగర్‌లోని గోకులంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



గోదావరిలో హంస వాహనంపై తెప్పోత్సవం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో బాలకృష్ణుడు

రత్నగిరిపై ఘనంగా శ్రీకృష్ణాష్టమి

అన్నవరం, ఆగస్టు 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని వేడుకగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు మంగళవాయిద్యాల నడుమ సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కళామందిరం వద్దకు తోడ్కొని వచ్చి ఆశీనులు గావించారు. స్వామి, అమ్మవార్ల ఎదురుగా సప్తగోమాతలను ఉంచి పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులతో గోవు వెనుక భాగంలో అర్చింపచేసి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, పీఆర్వో కృష్ణారావు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి నిర్వహించారు. తూర్పు రాజగోపురాన్ని ఆనుకుని ఉన్న శ్రీగోకులంలో అర్చకుడు కంచిబొట్ల వరదయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణపరమాత్మునికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం రామాలయం ఎదురుగా యాదవ బాలలతో ఉట్టి సంబరం జరిపారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను పల్లకిలో తొలిపావంచా వద్దకు మెట్లమార్గంలో తీసుకొచ్చారు. విశేష పూజల అనంతరం భక్తుల కోలాహలం నడుమ ఉట్టి కొట్టించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొండ దిగువ గోశాలలో సూపరెంటెండెంట్ ఐవీ రామారావు పర్యవేక్షణలో తొలిసారిగా కృష్ణాష్టమి వేడుకలు జరిపారు.



అన్నవరం దేవస్థానంలో గోపూజను తిలకిస్తున్న ఈవో రామచంద్రమోహన్, భక్తులు



ఇస్కాన్‌లో సందడే సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 26: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. తెల్లవారుజామున 4.30 గంటలకు మహా మంగళహారతితో ప్రారంభించి శృంగార హారతి, శ్రీమద్ భాగవత ప్రవచనం, పూర్ణాహుతి, అవభృద స్నానం నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, నృత్యం, పాటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు హేమా నిమాయిదాస్ సారథ్యంలో బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు విచ్చేశారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం, అనంత శేషవాహన సేవ, తెప్పోత్సవం, శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం, రాధాగోపీనాథులకు మహాకుంభాభిషేకం, మహా ప్రసాద వితరణ జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీకృష్ణస్వామిని దర్శించుకుని ఆయన ఆశీస్సులు పొందారు.



వి.సృజన్, ఎన్.రవికిరణ్

జిప్‌మర్, ఎయిమ్స్‌లో 'ఆదిత్య' విద్యార్థులకు సీట్లు

కాకినాడ రూరల్, ఆగస్టు 26: నీట్-2024 ప్రవేశ పరీక్షలో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల గంగరాజునగర్ బ్రాంచ్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మకమైన జిప్‌మర్, ఎయిమ్స్‌లో మెడికల్ సీట్లు సాధించినట్టు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వి.సృజన్ 715, ఎం.విశ్వంత్ 705 మార్కులతో జిప్‌మర్‌లోను, వైనైమితారాణి 705, ఎన్.రవికిరణ్ 710, ఆర్.రామ్‌గోపాల్ 695 మార్కులతో ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించారన్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి ప్రిన్సిపాల్ జె.మొయినా అభినందించారు.





బ్యారేజ్‌పై నుంచి పిచ్చుకలంకను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు, ఒబెరాయ్ సంస్థ ప్రతినిధి, పర్యాటక మ్యాప్‌ను మంత్రి దుర్గేష్‌కు చూపిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పిచ్చుకలంకను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- పెట్టుబడులు పెట్టేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గోదావరి తీరం పరిశీలన

ఆత్రేయపురం, ఆగస్టు 26: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ముందుకు వచ్చారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక ప్రాంతాన్ని సోమవారం మంత్రి దుర్గేష్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ మహేష్‌కుమార్, ముంబయికి చెందిన ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. 50 ఎకరాల్లో పిచ్చుకలంకను అభివృద్ధి చేసేందుకు ఒబెరాయ్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడంతో ఈ పర్యటన చేపట్టారు. ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులకు పిచ్చుకలంక ప్రాంత అభివృద్ధితో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల వివరాలను వివరించారు. పిచ్చుకలంక అభివృద్ధిపై ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిశారని, పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారని మంత్రి దుర్గేష్ తెలిపారు. హోటల్స్, రిసార్ట్స్, బోట్ షికారు వంటి వాటికి పిచ్చుకలంక అనువుగా ఉంటుందని సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. అఖండ గోదావరి ప్రాంతం కావడంతో పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు. ఒబెరాయ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శంకర్‌జీ, ప్రముఖ ఆర్కిటెక్ట్ వినోద్ గోస్వామితో కూడిన త్రిసభ్య కమిటీ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి విశిష్ట ప్రాంతాల మ్యాప్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. రానున్న పుష్కరాలకు పిచ్చుకలంకను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి చెప్పారు. తద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మివెంకన్న, మాజీ సర్పంచ్ జల్లి కామేశ్వరరావు, టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, జనసేన నాయకుడు బండారు బాబి పాల్గొన్నారు.



నిందితుడు జయరామ్‌ను చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పది కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు... రిమాండ్‌కు తరలింపు

గోకవరం, ఆగస్టు 26: గంజాయి కలిగి ఉన్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం కూడలి వద్ద బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ గమనించి అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగ్‌ను తనిఖీ చేసి సుమారు 10 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జాముగూడకు చెందిన వంతల జయరామ్‌గా నిర్ధారించారు. కాగా అతడు ఈనెల 23వ తేదీన 813.590 కిలోల గంజాయితో పట్టుబడిన బొలెరో వాహనం యజమానిగా నిర్ధారణ అయ్యింది. బొలెరో వాహనం వదిలి పరారైన వ్యక్తుల్లో ఒడిసా రాష్ట్రం చిత్రగుంటకు చెందిన డ్రైవర్ కిల్లో జయరాం ఉన్నట్టు తెలిసింది. తాంగి చంద్ర అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. జయరామ్‌ను అరెస్టు చేసి రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు డీఎస్పీ చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రౌతులపూడి, ఆగస్టు 26: మాయమాటలు చెప్పి ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్ బాలికను యువకుడు గర్భవతి చేసిన ఘటన లచ్చిరెడ్డిపాలెంలో జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం విచారణ చేపట్టారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో చందనాడ కాశీ (21) పాల కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఓ బాలిక అమ్మమ్మ గారింటికి వస్తుండగా మాయమాటలు చేప్పి లోబరుచుకుని గర్భవతి చేశాడు. యువతి కడుపు నొప్పి వస్తోందని చెప్పడంతో తల్లిదండ్రులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ చేపట్టారు. యువకుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

రైలు నుంచి జారిపడి ఒడిసా వాసి మృతి

అనపర్తి, ఆగస్టు 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సామర్లకోట జీఆర్పీ ఎస్‌ఐ బి.లోవరాజు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి ఓ ప్రయాణికుడు జారి పడ్డాడని అనపర్తి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ బి.శ్రీధర్ సమాచారం మేరకు అనపర్తి వెళ్లేటప్పటికి ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ప్రకారం ఒడిసాకు చెందిన చిత్రాసేన్ దాస్(42)గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానం పెనుభూతమై...

భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త

అనపర్తి, ఆగస్టు 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో డంబెల్‌తో తలపై మోది హతమార్చాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన తుపాకుల సాయి, అరుణకుమారిలకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం అనపర్తి వచ్చి జీవనం సాగిస్తున్నారు. పది, ఏడేళ్ల వయసున్న ఆడపిల్లలు ఉన్నారు. సాయి కోడిగుడ్ల వ్యాన్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందేమోనని అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ మద్యం తాగొచ్చి చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. సోమవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న సాయి ఎక్సర్‌సైజ్ చేసే డంబెల్‌తో తలపై తీవ్రంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ శివగణేష్, ఎస్ఐ శ్రీనునాయక్ సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





అరుణ కుమారి మృతదేహం (ఎడమ), పాత చిత్రం (కుడి)

శ్వాస ఆడక మరో బాలుడు మృతి

చింతూరు, ఆగస్టు 26: శ్వాస ఆడక మరో బాలుడు మృతి చెందిన సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నర్సింగపేటలో చోటుచేసుకుంది. నర్సింగపేటకు చెందిన దుమ్మిరి బాబూరావు-సుబ్బలక్ష్మి కుమారుడు అశ్విన్ (45 రోజుల చిన్నారి) ఆదివారం వాంతులు, విరోచనాల బారిన పడ్డాడు. దీంతో చింతూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు బిడ్డను పరీక్షించి రెండు రకాల సిరప్‌లు ఇవ్వడంతో పాటు మరో రెండు రకాల సిరప్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుగా కొనుగోలు చేసుకోమని చెప్పారు. కొద్ది సమయం తర్వాత బిడ్డ ఆరోగ్య పరిస్థితి కాస్త మెరుగుపడినట్టు కనిపించడంతో ఆసుపత్రి నుంచి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో శ్వాస తీసుకోవడంలో బిడ్డ ఇబ్బందిపడింది. దీంతో కూనవరం మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని... వెంటనే మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఇప్పటివరకు చింతూరు, కూనవరంల్లో శ్వాసకోస తదితర వ్యాధుల బారిన పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ బాలుడి మృతితో మృతుల సంఖ్య ఆరుకు చేరింది.



మృతి చెందిన 45 రోజుల చిన్నారి

ఏజెన్సీ సమాచారం

వేడుకగా శ్రీకృష్ణాష్టమి



మోతుగూడెం డీఏవీ పాఠశాలలో చిన్నారులతో ఉపాధ్యాయులు

మోతుగూడెం, ఆగస్టు 26: చింతూరు మండలం డొంకరాయి, మోతుగూడెంల్లోని ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మోతుగూడెం లక్ష్మీగణపతి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు ప్రారంభించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికలు వేషధారణల్లో అలరించారు. యాదవ యూత్ సభ్యులు, మోతుగూడెం యూత్ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పొల్లూరు కొత్త క్వార్టర్స్ వద్ద కృష్ణాష్టమి నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.





డొంకరాయి డీఏవీ పాఠశాలలో చిన్నారులు, లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఉట్టి సంబరం



పి.యర్రగొండ గురుకుల కళాశాలలో...

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణలతో అలరించారు. ఉట్టి సంబరం ఉత్సాహంగా సాగింది.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరు, ఇందుకూరుపేటల్లో శ్రీకృష్ణజన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే గ్రామాల్లోని శ్రీకృష్ణుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉట్టి కొట్టే వేడుక జరిపారు.

ఎటపాక: మండలంలోని గన్నవరం, నందిగామ, ఎటపాక, సీతాపురం, కన్నాయిగూడెం గ్రామాల్లో కృష్ణాష్టమి నిర్వహించారు. సాయంత్రం ఉట్టి సంబరంలో యువకులు, పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణునిని ఊరేగించారు. యాలం వెంకటేశ్వరరావు, పులుసు పుల్లారావు, నలజాల భద్రయ్య, నరేష్ పాల్గొన్నారు.







ఉట్టికొడుతున్న అబ్దుల్ కలాం పాఠశాల చిన్నారులు, శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారి

వర రామచంద్రాపురం: వీఆర్ పురంలోని రామాలయం, విఘ్నేశ్వర ఆలయం, వడ్డిగూడెం కాలనీ, వీఆర్ పురం కాలనీ, వడ్డిగూడెం గ్రామం, గోల్డ్‌ఫాస్ జగదీష్‌వారి వీధి, ప్రధాన కూడళ్లు, రేఖపల్లి, రాజుపేట, సీతంపేట, శ్రీరామగిరిల్లో కృష్ణాష్టమిని వేడుకగా జరిపారు. మండపాలను బెలూన్లతో అందంగా అలంకరించారు. ఉట్టి కట్టి యాదవులను ఆటలాడిస్తూ వాళ్లపై రంగునీళ్లు చల్లుతూ ఉట్టి సంబరం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

'ఆదివాసీల వలసలను నిరోధించాలి'

రంపచోడవరం, ఆగస్టు 26: ఏజెన్సీలో ఉపాధి లేక ఆదివాసీలు మైదాన ప్రాంతాలకు వలసలు తరలి వెళ్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు పి.లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మార్క్స్ ఏంగిల్స్ భవనంలో మడకం గోవింద్ అధ్యక్షతన ఏఐకేఎంఎస్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పల్లాల బాలురెడ్డి మాట్లాడుతూ అరకు, పాడేరుల్లో కాఫీ బోర్డు తరహా జీడిమామిడి బోర్డు ఏర్పాటుచేసి ఏజెన్సీలో ఆదివాసీలకు పెట్టుబడి కింద ఎకరానికి రూ.30వేలు వడ్డీలేని రుణం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కారం లచ్చన్నదొర, పి.భూపతిరెడ్డి, కె.కృష్ణ, కె.మూర్తి, ఇ.జోగిరెడ్డి, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.అనసూయ పాల్గొన్నారు.

టీడీపీ యాప్‌తో ప్రచారానికి ప్రశంస



రంపచోడవరం, ఆగస్టు 26: టీడీపీ యాప్ ద్వారా ప్రజలకు విస్తృత స్థాయిలో ప్రచారం చేసిన కృషిని అభినందిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పలువురికి ప్రశంసాపత్రాలు పంపించారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నుంచి పెంటపాటి అనంతమోహన్ సోమవారం ప్రశంసా పత్రం అందుకున్నారు.

విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కూనవరం, ఆగస్టు 26: మండలంలోని నరసింగపేట నుంచి పోలిపాక కొత్త విద్యుత్ లైన్‌కు ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేసింది. ఈ లైన్ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోడే రామయ్య, నోముల సత్యనారాయణ, గడేసుల ప్రేమ్‌చంద్, గడ్డిపాటి ప్రసాద్, గడేసుల రంజిత్, చెలకాని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు. సోమవారం ఎంపీ కార్యాలయానికి వెళ్లిన ఆయన రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలకు చేపట్టవలిసిన అభివృద్ధి పనులు, సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టవల్సిన చర్యలు, ఎంపీ సహకారం తదితర అంశాలపై చర్చించారు.

సేవా మూర్తికి ఘన నివాళి

» సేవకు నిలువెత్తు నిదర్శనం మదర్‌థెరిస్సా
» జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: సమాజ సేవకు నిలువెత్తు నిదర్శనం మదర్‌థెరిస్సా అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 46వ డివిజన్‌లో సోమవారం మదర్‌థెరిస్సా యూత్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆనంద్‌నగర్‌లోని ఆమె విగ్రహం వద్ద జరిగిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి థెరిస్సా విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంచారు ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ 12 ఏళ్ల వయస్సులో మదర్‌దెరిస్సా సేవకు అంకితమయ్యారని, కోల్‌కత్తాలోని స్కూల్‌కు 1937 మే 4న టీచర్‌గా వచ్చారని చెప్పారు. అక్కడ మురికివాడల్లో దయనీయ స్థితిని చూసి చలించి ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి మానవసేవకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇటువంటి మహనీయురాలిని నిత్యం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, మండల రవికుమార్, అగురు ధనరాజ్, మండల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక గౌతమి జీవకారుణ్య సంఘం వృద్ధాశ్రమంలో ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. దిశ డీఎస్పీ కడలి వెంకటేశ్వరావు గౌరవ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంచారు. కార్యక్రమంలో ఆదిత్య డైరెక్టర్ ఎస్‌సీ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో జీవీఎస్ నాగేశ్వరరావు, తుమ్మిడి విజయకుమార్, లోలభట్టు శ్రీనివాసరాజు, ఎఫ్ఎస్ఎస్ సుధాకర్ పట్నాయక్ పాల్గొన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో మదర్‌థెరిస్సా విగ్రహానికి లయన్స్ క్లబ్ రాజమండ్రి అధ్యక్షుడు ఎంవీఎస్ఎస్ఆర్ గుప్తా, పూర్వ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబులు నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు వి.కుమారస్వామి, బుచ్చిరాజు, లక్ష్మి వసంత పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. థెరిస్సా స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సేవాభావం కల్గి ఉండాలని, విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని విశ్వేశ్వరరెడ్డి కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆర్యాపురంలోని ఏబీ నాగేశ్వరరావు పార్కులో సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్ మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాసాని శంకరరావు, మారిశెట్టి సత్యనారాయణ, జామిశెట్టి అప్పాజీ, బండి నరేంద్ర, కె.కె.సంజీవరావు, గోరుగుంతల వరప్రసాద్, పడాల అప్పారావు, ఎం.పార్వతి పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కడియంలో థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో మహిళలకు చీరలు పంచుతున్న ఎమ్మెల్యే వాసు

ధవళేశ్వరం: స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ ముత్యాల పోసికుమార్ మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. సేవకు ప్రతిరూపం అయిన మదర్‌దెరిస్సా ఆశయాలను అందిపుచ్చుకుని తమకు తోచిన సేవ చేస్తూ సమాజంలో భాగస్వాములు కావాలన్నారు. జనసేన నాయకుడు అల్లంపల్లి ప్రసాద్ సమకూర్చిన చీరలను వృద్ధులకు పంపిణీ చేశారు. జి.జయకుమార్ దంపతుల ఆర్థిక సహకారంతో వృద్ధులకు, దివ్యాంగులకు అన్నదానం చేశారు.

కడియం: దుళ్ల గ్రామంలో మదర్‌థెరిస్సా విగ్రహానికి మదర్‌థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో కొండపల్లి పట్టియ్య, తోకల శ్రీనివాసరావు, గుర్రపు సత్యనారాయణ, కట్టుంగ నాగరాజు, తాతపూడి బాబి, టేకి శ్రీనివాస్ పాల్గొన్నారు. పొట్టిలంకలో లూథరన్ చర్చిలో మదర్‌థెరిస్సా జయంతి నిర్వహించి కేకు కట్ చేశారు. నక్కా వెంకటరత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

అనీల్‌కుమార్‌కు మదర్ థెరిస్సా అవార్డు



బిక్కవోలు, ఆగస్టు 26: కొంకుదురు గ్రామానికి చెందిన పూర్ణ ఫ్రెండ్స్ ఫౌండేషన్ అండ్ బ్లడ్ సపోర్ట్ ఫౌండర్ దేవాదుల అనీల్‌కుమార్‌కు మదర్ థెరిస్సా అవార్డు లభించింది. విజయవాడలో మదర్ సర్వీస్ సొసైటి ఫౌండర్ మల్లాది ప్రసాదరావు నిర్వహించిన జాతీయ అవార్డుల్లో భాగంగా అనీల్‌కుమార్‌కు ఈ అవార్డును సోమవారం అందజేశారు. అనిల్ చేస్తున్న రక్తదాన శిబిరాలు, అత్యవసర పరిస్థితుల్లో రక్తదాతలను సమకూర్చడం, పేదలకు దుప్పట్లు పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల్లో నోట్‌బుక్స్ పెన్నులు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఈ అవార్డును అందజేసినట్టు ప్రసాదరావు తెలిపారు.

కృష్ణం..వందే..జగద్గురుమ్..

» వేణుమాధవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
» పలుచోట్ల ఉట్టికొట్టి యువత సంబరాలు
» రాధాకృష్ణులు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 26: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. దివాన్‌చెరువులోని శ్రీరాధాకృష్ణస్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వామికి పంచామృత అభిషేకాలు, విశిష్ట పుష్పాలంకరణ జరిగింది. సూర్యారావుపేట శ్రీముత్యాలమ్మ కోలాట భజన కమిటీ కోలాటం ప్రదర్శించింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డువెంకటరమణ చౌదరి, జనసేన నియోజకవర్గం కన్వీనర్ బత్తుల వెంకటలక్ష్మి, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, సీనియర్ నాయకుడు అంకం గోపి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయకమిటీ స్వామి వారి చిత్రపటాలను బహూకరించింది. రాత్రి ఆలయం వద్ద, స్థానిక రామాలయం వద్ద ఉట్లోత్సవం జరిగింది. అలాగే పాలచర్లలోని కృష్ణుడి ఆలయం వద్ద అర్చనలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దుర్గా ఆలయం వద్ద బాలవికాస్ చిన్నారులతో గోశాలలో గోపిక, యశోద, కృష్ణుని వేషధారణ ప్రదర్శనలు జరిగాయి. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం జరిగింది. అలాగే పాతతుంగపాడు, పుణ్యక్షేత్రం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో జననీ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులు రాధ, గోపికలు, కృష్ణుడు వేషధారణల్లో అలరించారు. అనంతరం ఉట్టికొట్టు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు హైమలీల, నటరాజేశ్వరి, కమలకుమారి, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

కడియం: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయం గోశాలలో గోసంరక్షణ సేవాసమితి సభ్యుడు గిరజాల బాబు, తులసి దంపతులు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, అర్చనలు, అభిషేకాలు, వస్త్రాలంకరణ చేసారు. అలాగే గిరజాల వీధిలోని కృష్ణుడి ఆలయం, రామాలయంలో ఆనం సంస్థల డైరెక్టర్ తుమ్మా తాతనాయుడు-సత్యవేణి దంపతులు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి నిర్వహించి అన్నసమారాధన చేపట్టారు. కడియం షిర్డిసాయి విద్యానికేతన్ డేస్పీ ఏసియాటిక్ స్కూల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణల్లో చిన్నారులు కనువిందు చేశారు. కార్యక్రమంలో షిర్డిసాయి విద్యానికేతన్ వ్యవస్థాపకుడు తంబాబత్తుల పాలేశ్వరరావు నాగమణి, ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగంపేట: వడిశలేరు గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. గ్రామాల్లో పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అందరినీ అకట్టుకున్నారు. చంద్రేడులో కంటిపూడి భార్గవి,సతీష్‌ల కుమారుడు సిద్ధిరాం కార్తిక్ శ్రీకృష్ణ వేషధారణలో పొలానికి వెళ్లి గోవులతో సమయం గడిపాడు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరం రెండో వార్డు గోపాలనగర్ పంత రోడ్డులోని శ్రీకృష్ణస్వామి దేవస్థానం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు పక్కుర్తి సత్తిబాబు ఆధ్వర్యంలో కలశ స్థాపన, మంత్ర పుష్పం, దీపారాధన, జరిగాయి. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్వామి వారిని దర్శించి, ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటాన్ని తిలకించి, గోపిక, కృష్ణ వేషధారణలతో వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణాష్టమి స్ఫూర్తిని, బాధ్యతను అందరికీ తెలియజేయాలన్నారు. స్వామిని కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆర్యాపురం బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకరరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, యర్రా వేణు గోపాలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, మరుకుర్తి రవి యాదవ్, అంకం గోపీ దర్శించుకున్నారు. స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం, శ్రీ గౌరంగ రాధాకృష్ణ మందిరంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీల త్రిదండిస్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహరాజ్ మంగళహారతులు, తులసి ప్రదక్షిణ, నగర సంకీర్తన,గోపూజ, హరినామ సంకీర్తన నిర్వహించినట్టు ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. శ్రీకృష్ణ స్వామిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, దర్శించి, గోకుల్ టీవీఎస్ అధినేత ఎన్‌వీవీ సత్యనారాయణ, ఎం.రంగప్రసాద్, నిమ్మలపూడి గోవింద్ తదితరులు దర్శించుకున్నారు.

రాజానగరం: స్థానిక శివాలయంలో వేణుగోపాలస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే శ్రీషిర్డీసాయి మందిరం, చక్రద్వారబంధం, రాధేయపాలెం, పల్లకడియం, కానవరం, ఫరిజెల్లిపేట, తూర్పుగోనగూడెం, కలవచర్ల, సీతారాంపురం, నరేంద్రపురం, నందరాడ, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. సాయంత్రం ఉట్టుకొట్టు సంబరాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని గాదరాడ, నర్సాపురం, పశ్చిమగోనగూడెం, కోరుకొండ, రాఘవాపురం, గుమ్ములూర్రు గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పశ్చిమగోనగూడెం గీతామిషన్ వద్ద ఆలయ ప్రధానార్చకులు ఇరగవరపు కృష్ణమాచార్యులు, ఇరగవరపు రఘురాం ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి వేద పారాయణం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భాగవత పారాయణ జరిగింది. సాయంత్రం స్వామికి ద్వాదశ పారాయణలు, నివేదనలు, హారతులు నిర్వహించారు. అనంతరం ఉట్టుకొట్టే ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. నర్సాపురంలో శ్రీకృష్ణాలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు తదితరులు విచ్చేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



కోరుకొండలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



హౌసింగ్‌బోర్డ్ కాలనీలో కృష్ణుడు, గోపికల వేషధారణలో దివ్యాంగులు



శ్రీకృష్ణ వేషధారణలో ముస్లిం బాలుడు

గోకవరం, ఆగస్టు 26: కృష్ణాష్టమి సందర్భంగా గోకవరంలోని శ్రీకృష్ణుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఒక ముస్లిం బాలుడు వేసిన శ్రీకృష్ణుడి వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. షేక్ మహబూబ్ బాషా, నహిర దంపతులు తమ కుమారుడు మీజన్ బాషాను చిన్ని కృష్ణుడిగా అలంకరించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, ఆగస్టు 26: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మార్కొండపాడులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్లు నిర్మించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నామనారు. సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటి సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణారావు, సర్పంచ్ శివపోసి, కె.హరికృష్ణ, బండి రామకృష్ణ, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకవల్లి రమేష్, జనసేన మండలాధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి, ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్, తాళ్లూరి ప్రసాద్, మద్దిపాటి వీరరాఘవులు, కేకే గంగాధరరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: పేదవారి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌కు రాజమహేంద్రవరం ఆవరోడ్డు బాలాజీపేటకు చెందిన ఏఎస్ గణేశ్వరరావు రూ16,500 విరాళం ఇచ్చారు. సోమవారం స్థానిక తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు కంటిపూడి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు మానవత్వం కలిగిన వారంతా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని, శుభకార్యాలు, పెళ్లిలు, పుట్టిన రోజులప్పుడు అన్నదానం చేయాలనుకునేవారు అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కంటిపూడి శ్రీనివాస్, మస్తాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాం నెం.4కి వెళ్లే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఎస్‌ఐ కె.మావుళ్లు తెలిపారు. సదరు వ్యక్తికి సుమారు 40ఏళ్లు ఉంటాయని.. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.94910 03239కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జగద్గురు పీఠంలో వేదసభ

పాల్గొన్న 2000 మంది వేదపండితులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 26: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక గౌతమఘాట్‌లోని శ్రీ జగద్గురు పీఠంలో సోమవారం కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి అధ్యక్షతన వేదసభ నిర్వహించారు. భారత జ్యోతి పురస్కార గ్రహీత గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనాపాటి, వేద సామ్రాట్, ఘనాలంకార కడియాల సీతారామ ఘనాపాటి నిర్వహణలో వేద స్వస్తి జరిగింది. నంతరం ఆరుగురు పరీక్షాధికారులకు పండిత సత్కారం చేశారు. వేదసభలో దాదాపు 2000 మంది వేదపండితులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు ఉత్తమ ర్యాంకులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: సీఎంఏ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని మాస్టర్ మైండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ బి.సోమశేఖర్ తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో ఆలిండియా స్థాయిలో 42 ర్యాంక్‌ను కె.తరుణ్ పవన్‌కుమార్ రాజు, సీఎంఏ ఫైనల్‌లో 37వ ర్యాంక్‌ను ఎస్.వీరవెంకట సుబ్రహ్మణ్యం సాధించారని తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ అకడమిక్ ప్రణాళికతో విద్యార్థులు కామర్స్ కోర్సుల్లో ఆలిండియా స్థాయిలో ర్యాంక్‌లు సాధించడానికి దోహదపడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మణికుమార్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు

దివాన్‌చెరువు, ఆగస్టు 26: రాజానగరం మండలం కొండగుంటూరుకు చెందిన పెంటగట్ల మణికుమార్‌కు బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు లభించిందని ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో సోమవారం మదర్‌సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాదరావు నిర్వహించిన ఒక కార్యక్రమంలో తనకు అంబేడ్కర్ జాతీయ అవార్డును అందజేశారన్నారు. తాను అనేక మార్లు రక్తదానం చేయడంతో బాటు నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను సదరు సంస్థ గుర్తించి ఈ అవార్డు అందజేశారని మణికుమార్ తెలిపారు.

ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

డివిజన్ కార్యదర్శిగా సురేష్



నూతనంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న సభ్యులు

రాజానగరం, ఆగస్టు 26: ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ సర్వసభ్య సమావేశం డివిజన్ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ అధ్యక్షతన రాజానగరం సెక్షన్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ కార్యదర్శిగా కందికట్ల సురేష్(సీనియర్ అసిస్టెంట్)ను డివిజన్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి నిరంతర కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. సమావేశంలో ఈపీడీసీఎల్ సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ జీజే సుధాకర్, జిల్లా అడ్వైజర్ డి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వి.కాంతారావు, కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, డివిజన్ గౌరవాధ్యక్షుడు తుమ్మల తాతారావు, సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: డబుల్ ఇస్మార్ట్
సూర్యామినీ	: ఏలియన్
సూర్యాప్యాలస్	: డిమోంటీ కాలనీ-2
స్వామి	: డిమోంటీ కాలనీ-2
శివజ్యోతి	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ(సాయికృష్ణ)	: కమిటీ కుర్రోళ్లు
రాజా	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
ఊర్వశి	: డబుల్ ఇస్మార్ట్
రంభ	: ఇంద్ర
మేనక	: రేవు, స్త్రీ-2
అప్సర	: మిస్టర్ బచ్చన్
కుమారి	: ఏలియన్, పరాక్రమం
అశోక	: ఆయ్
వీఎస్ మహల్(నామవరం)	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ఆయ్
వెంకటసూర్య(కడియం)	: తంగలాన్,ఆయ్
సత్యగౌరి (అనపర్తి)	: ---
సూర్యశ్రీ (అనపర్తి)	: ---
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఆయ్
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: ---
శ్రీనివాస (గోకవరం)	: ---
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహల్(రంపచోడవరం)	: ---
నవయుగ(చింతూరు)	: -----

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఇస్కాన్‌లో సందడే సందడి

రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న దృశ్యం

అందాల జిల్లాకు పర్యాటక సొగసు!



కడియపులంక కెనాల్‌లో బోట్ షికారు, స్టాల్స్ ఏర్పాటు నమూనా

- మళ్లీ తెరమీదకు అఖండ గోదావరి ప్రాజెక్టు
- రూ.1000 కోట్లతో రాజమహేంద్రవరం రివర్స్ ఫ్రంట్ అభివృద్ధి
- వచ్చే పుష్కరాల నాటికి గోదావరి ఘాట్ల సుందరీకరణ, విస్తరణ
- కడియం నర్సరీల్లో పర్యాటక కళ
- ఇప్పటికే బోట్ సిద్ధం
- పొట్టిలంక నుంచి కడియపులంక పూలమార్కెట్ వరకూ కెనాల్ బోట్ షికారు
- నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం పంట కాలువలో బోట్ షికార్
- పిచ్చుకలంకలో ఒబెరాయ్ 7 స్టార్ హోటల్
- ఒబెరాయ్ ప్రతినిధులతో కలసి పిచ్చుకలంకను పరిశీలించిన మంత్రి దుర్గేష్

హేవలాక్ బ్రిడ్జి తీర్చిదిద్దేదిలా..



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

అందాల తూర్పుగోదావరి జిల్లాకు పర్యాటక హంగులు రానున్నాయి. గత పుష్కరాల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గోదావరి, దాని పరీవాహక ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి అఖండగోదావరి ప్రాజెక్టును ప్రారంభించిన సంగతిని తెలిసిందే. అప్పట్లో రూ.100 కోట్లు కూడా ప్రకటించారు. రాజమహేంద్రవరంలో అఖండగోదావరి రీజినల్ డైరెక్టర్ (టూరిజం ఆర్‌డీ) కార్యాలయం కూడా ఏర్పాటుచేశారు. అఖండ గోదావరిలో బోట్ షికారు ప్రారంభించారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొత్తం అఖండ గోదావరి ప్రాజెక్టును ఎత్తివేయడంతోపాటు పర్యాటక రంగాన్నే ధ్వంసం చేసింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పర్యాటక రంగానికి కళ తేనున్నారు. రాష్ట్రపర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ జిల్లాకు చెందినవారే కావడంతో ఈసారి ఇక్కడ పర్యాటక రంగం త్వరగానూ రూపుదిద్దుకుంటుందనే నమ్మకం ప్రజలల్లో ఏర్పడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం మళ్లీ అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపాలని టూరిజం డిపార్ట్‌మెంట్‌ను తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చెందడానికి ఆస్కారం కనిపిస్తోంది.

● పర్యాటక ప్రాంతంగా కడియం నర్సరీలు

ప్రస్తుతం తక్షణం కడియం నర్సరీలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి ప్రణాళికలు సిద్ధంచేయిస్తున్నారు. ఈనేపథ్యంలో కడియపుంకలో రెండు రూట్లను గుర్తించారు. పర్యాటకులు వరుసగా ఎక్కువ నర్సరీలను సందర్శించే విధంగా ప్రతిపాదన చేశారు. కడియపులంకలో జాతీయ రహదారి నుంచి వరసగా ఒక నర్సరీ నుంచి మరో నర్సరీలోకి సీసీ బాట ఏర్పాట చేయనున్నారు. నర్సరీల ముఖద్వారాల్లో గేట్లు కూడా పెడతారు. సత్యదేవా నర్సరీ నుంచి పరిసర ప్రాంతాల నర్సరీలను సందర్శించే విధంగా మరొక రూట్ సిద్ధం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 6 గంటల వరకూ పర్యాటకులు ఈ ప్రాంతాలను సందర్శించవచ్చు. ఇవి అమలులోకి వచ్చి పర్యాటకులను బాగా ఆకర్షించిన తర్వాత రెండు మూడు రోజులపాటు పర్యాటకులు ఈ ప్రాంతంలోనే ఉండి ఆనందించేటట్టు కాటేజీల నిర్మాణ ప్రతిపాదన కూడా ఉంది. విద్యుత్ బ్యాటరీల సహాయంతో నడచే ఈ-వెహికల్స్‌ను ఏర్పాటుచేసే యోచన ఉంది.



కాటన్ బ్యారేజీపై నుంచి గోదావరి వ్యూ చూస్తున్న మంత్రి, ఒబెరాయ్ ప్రతినిధులు

● కెనాల్ బోట్ షికారు

పొట్టిలంక నుంచి కడియపులంక పూల మార్కెట్ వరకూ కిలోమీటరన్నర దూరం మేర కాలువలో బోట్ షికారు ఏర్పాటుచేయనున్నారు. వీటికోసం హైవేలో మూడు పాయింట్లు గుర్తించనున్నారు. పొట్టిలంకలో బోట్ ఎక్కి కడియపులంక వరకూ రావచ్చు. తిరిగి వెళ్లవచ్చు. మధ్యలో దిగడానికి, ఎక్కడానికి కూడా హైవే వద్ద ఓ పాయింట్ గుర్తించనున్నారు. ఈ బోట్ షికారు కోసం రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే ఓ బోటును ఈ ప్రాంతానికి కేటాయించారు. ప్రస్తుతం అది పాశర్లపూడి రేవులో ఉంది. త్వరలో అధికారులు దీన్ని ఇక్కడకు తేనున్నారు. బోట్ షికారు ప్రారంభించేముందు కాలువకు రెండు వైపులా బ్యూటిఫికేషన్ చేయనున్నారు. ఇక్కడ 20 షాపులు నిర్మించడానికి కూడా అనువైన స్థలం కోసం ఆరా తీస్తున్నారు. ఇటువంటి ప్రతిపాదన నిడదవోలులో కూడా ఉంది. నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్లే పంట కాలువలో కిలోమీటన్నర దూరం బోట్‌షికారు పెట్టే ఆలోచన కూడా ఉంది.

● పిచ్చుకలంకలో ఒబెరాయ్ 7స్టార్ హోటల్

ధవళేశ్వరం బ్యారేజీ పక్కన ఉన్న పిచ్చుకలంకలో ఒబెరాయ్ సంస్థ 7 స్టార్ హోటల్ నిర్మించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. సోమవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలసి ఒబెరాయ్ కంపెనీ ప్రతినిధులు పిచుకలంకను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.


● రూ.1000 కోట్లతో రివర్‌ఫ్రంట్ టూరిజం

రాజమహేంద్రవరంలో అన్ని గోదావరి ఘాట్లను అందంగా తీర్చిదిద్దడంతోపాటు విస్తరించడానికి, హేవలాక్ బ్రిడ్జి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడానికి, నగరంలోని ముఖ్యప్రాంతాలు, స్థలాలు వంటి వాటిని అభివృద్ధి చేయడానికి, అఖండ గోదావరిలో ఇసుక లంకలను కూడా పర్యాటక రంగంలో అభివృద్ధి చేసే ప్రతిపాదనలు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.20 కోట్లు శాంక్షన్ కాగా, రూ.8 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వచ్చే పుష్కరాల నాటికి వెయ్యి కోట్లు వెచ్చించే లక్ష్యంతో ఆలోచనలు చేస్తున్నారు.

పిచ్చుకలంకలో ఒబెరాయ్

7స్టార్ హోటల్ నిర్మాణం కోసం
మంత్రి దుర్గేష్, ఒబెరాయ్ ప్రతినిధుల పర్యటన

పిచ్చుకలంక కల నెరవేరనున్నదా? అనే ప్రశ్నకు అవుననే సమాధానం వినవస్తోంది. దశాబ్దాల కిందటే టీడీపీ సీనియర్ నేత, ప్రస్తుతం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఈ లంకను పర్యాటకంగా అభివృద్ధి చేయడం కోసం శంకుస్థాపన చేశారు. ఇప్పటికే శిలాఫలకం ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉంది. కానీ ధవళేశ్వరం బ్యారేజీ పక్కన ఉండడంతో రాజమహేంద్రవరానికి అనుసంధానం చేస్తూ ఇక్కడ పర్యాటక అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నారు. 2019 వరకూ అధికారంలో ఉన్న తెలుగుదేశం హయాంలో పిచుకలంకను మెరక చేశారు. తర్వాత వైసీపీ వదిలేసింది. తిరిగి తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే మళ్లీ దృష్టి పెట్టారు. సోమవారం రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బండారు సత్యానందం, ఒబెరాయ్ గ్రూప్స్ వైస్ ప్రెసిడెంట్ శంకర్, ఆర్కిటెక్ వినోద్ గోస్వామి తదితరులతో కూడిన బృందం స్వయంగా ఇక్కడ పరిశీలించింది. మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల, బండారు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జనసేన నేత బండారు శ్రీనివాసరావు, టూరిజం ఆర్‌డి స్వామినాయుడు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం నగరం నుంచి రివర్ వ్యూ

ఈ క్రాప్ నమోదు, జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్ పూర్తిచేయాలి

టెలీకాన్ఫరెన్స్‌లో
జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 26 : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం ఈ-క్రాప్ నమోదు, జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని.. అందుకు డివిజన్, మండల స్థాయి అధికారులు గ్రామ స్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఖరీఫ్ సీజన్ ఈ-క్రాప్ నమోదు, జాయింట్ ఎల్‌పీఎంపై జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులతో కలెక్టరు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో పంట నమోదు 60 శాతం పూర్తయిందని, ఈ-క్రాప్ నమోదుకు సెప్టెంబరు 15 వరకు మాత్రమే సమయం ఉన్నందున ఈలోగా పంట వివరాలు నమోదు పూర్తిచేయాలన్నారు. ఈ-పంట నమోదు పూర్తి చేయడంలో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ అధికారులు వాటి నిర్ధారణ (ప్రమాణీకరణ) చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 60.24 శాతం నిర్ధారణ చేసినట్టు తెలిపారు. ఈ పంట నమోదులో 60 శాతంకంటే తక్కువచేసిన వాటిలో సీతానగరం, రాజానగరం, దేవరపల్లి, కోరుకొండ, నల్లజర్ల, కడియం మండలాలు ఉన్నాయన్నారు. పంటనష్టం సబ్సిడీ తదితర ప్రభుత్వ ప్రోత్సాహకాలు రైతులు పొందేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అన్న విషయాన్ని ఇప్పటికే పలుమార్లు చెప్పడం జరిగిందన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలతోపాటు రైతుల ద్వారా ప్రమాణీకరణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు కేవలం 7.8 శాతం మంది రైతులు ఆ మేరకు ధ్రువీకరణ చేశారని, మిగిలిన వారితో కూడా సమాంతరంగా లక్ష్యాలు సాధించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్, మండల స్థాయి అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టంచేశారు. జాయింట్ ల్యాండ్ ప్రాపర్టీ మ్యాపింగ్‌కు సంబంధించి 271 గ్రామాలకుగాను 183 గ్రామాల్లో 11,469 హెక్టార్ల విస్తీర్ణంలో 31,395 ల్యాండ్ రికార్డులు నవీకరించాల్సిఉండగా 6643 (21 శాతం) పూర్తి చేశారన్నారు. నల్లజర్ల, రాజానగరం, ఉండ్రాజవరం, చాగల్లులలో పదిశాతంలోపు ఉండగా, దేవరపల్లి సీతానగరం, నిడదవోలు, గోకవరం మండలాల్లో అత్యధిక గణన పూర్తి చేశారన్నారు. రికార్డులపరంగా రాజానగరం 5115, కోరుకొండ 7049, బిక్కవోలు 4191 భూ వివరాలను నవీకరించాల్సి ఉందన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆ మేరకు లక్ష్యాలను వచ్చే నెల మొదటివారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డీవోలు కేఎల్ శివజ్యోతి, ఆర్.కృష్ణనాయక్, జిల్లా వ్యవసాయఅధికారి ఎస్.మాధవరావు, హార్టికల్చర్ అధికారి బి.సుజాత, మండల అధికారులు పాల్గొన్నారు.



గోపాలనగర్ పుంత రోడ్డులోని శ్రీకృష్ణస్వామి దేవస్థానంలో ఎంపీ పురందేశ్వరి పూజలు చేస్తున్న దృశ్యం.. గోపిక, కృష్ణ వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎంపీ పురందేశ్వరి ముచ్చట



గొలిపే చిత్రం

ఫలితాన్ని ఆశించకుండా ధర్మాన్ని కాపాడాలి

కృష్ణాష్టమి వేడుకల్లో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/కల్చరల్, ఆగస్టు 26: కృష్ణాష్టమి స్ఫూర్తి, బాధ్యత అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని, ఫలితాన్ని ఆశించకుండా ధర్మాన్ని కాపాడాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం కృష్ణాష్టమి వేడుకలు రాజమహేంద్రవరంలో పలుచోట్ల ఘనంగా జరిగాయి. గోపాలనగర్ పుంతరోడ్డులోని శ్రీకృష్ణ స్వామి వారి దేవస్థానం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితర ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పురందేశ్వరి కృష్ణయ్యస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కోలాటాన్ని ఎంపీ తిలకించారు. గోపిక, కృష్ణ వేషధారణలతో వచ్చిన చిన్నారులతో ముచ్చటించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పక్కుర్తి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కలశస్థాపన, మంత్రపుష్పం, దీపారాధన చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, బొమ్ముల దత్తు, తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పురందేశ్వరి రాజమహేంద్రవరం అద్దేపల్లి కాలనీలోని శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ ఉన్న గోవుల సంరక్షణ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత చిన్నారి గోపికలతో ముచ్చటించి వారితో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు కూడా పాల్గొన్నారు.

సీనరేజి వసూలు మొదలైంది!

- గతంలో మాదిరిగానే ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల చెక్‌పోస్టులు
- దోపిడీ లేకుండా అధికారికంగానే వసూలు చేసేటట్టు చర్యలు
- ప్రభుత్వాదాయానికి గండి కొట్టకుండా నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మైన్స్ సీనరేజీ వసూళ్లు మొదలయ్యాయి. ప్రభుత్వాదాయానికి గండిపడకుండా మైన్స్ సీనరేజీ ద్వారా నేరుగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేటట్టు ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. గత ప్రభుత్వంలో సీనరేజీ వసూలు చేసిన సుధాకర్ ఇన్‌ఫ్రాకు వచ్చే ఏప్రిల్ వరకూ గడువు ఉంది. ఈనేపథ్యంలో అదే సంస్థకు సీనరేజీ వసూళ్ల బాధ్యతను అప్పగించింది. కానీ ఈ సంస్థ వద్ద ఏఎంఆర్ అనే సంస్థకు సబ్‌లీజుకు తీసుకుని వసూలు మొదలు పెట్టినట్టు చెబుతున్నారు. జిల్లాలో బిల్డింగ్ మెటీరియల్, గ్రావెల్, లేటరైట్, సుద్దగనులు వంటి అనేక గనులు ఉన్న సంగతి తెలిసిందే. దీనికి గతంలో మైన్స్ అధికారులే నేరుగా సీనరేజీ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించేవారు. కానీ అప్పట్లో కొందరు మైన్స్‌లీజుదారులు, అధికారులు కుమ్మక్కయి బిల్లులు లేకుండా చేసి, సీనరేజీ ఎగ్గొట్టేవారు. అయినా ఏడాదికి రూ.కోట్లలోనే ఆదాయం వచ్చేది. కానీ వైసీపీ ప్రభుత్వంలో ఇందులోని లొసుగులు గమనించి, సీనరేజీ వసూళ్లను అధికార్ల నుంచి తప్పించి, జిల్లాల వారీ ప్రైవేట్ సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చిన సంగతి తెలిసిందే. నెలకు సుమారు రూ. 10 కోట్లు ముందుగానే చెల్లించి, తర్వాత ఈ సంస్థ ఎంతైనా వసూలు చేసుకోవచ్చు. దీన్ని అవకాశంగా తీసుకుని వైసీపీకి చెందిన కొందరు మైనింగ్ దోపిడీకి పాల్పడ్డారు. అధికారికంగా వసూలు చేయవలసిన సీనరేజీకంటే ఐదారురెట్లు ఎక్కువ వసూలుచేసి రూ. కోట్లు దోచుకున్నారు. ఇది ప్రజల్లో కూడా బాగా వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. రెండేళ్లకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల మైన్స్ సీనరేజి కింద రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేటట్టు ఒప్పందం పెట్టుకుని రూ.వందలాది కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. పైగా ఎన్నికల ముందు ప్రభుత్వానికి సుమారు రూ.44 కోట్లు బాకీపడింది. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీనరేజీ వసూలు ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం పద్ధతి ప్రకారం సీనరేజీ వసూలు చేయడానికి నిర్ణయించింది. గతంలో మాదిరిగా ఇష్టానుసారం దోపిడీ లేకుండా ప్రతీ క్యూబిక్‌మీటర్, లేదా ప్రతీ టన్ను మెటీరియల్‌కు నేరుగా ప్రభుత్వానికే సీనరేజీ వచ్చేటట్టు ఏర్పాటుచేసింది. చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో ప్రస్తుతం పాత సంసనే కొనసాగించేటట్టు చేసినట్టు సమాచారం. కానీ సెప్టెంబరు 1 నుంచి వసూలు చేసేటట్టు ఆర్డర్‌లో ఉంది. కానీ ఈనెల 24 నుంచే వసూలు మొదలైనట్టు చెబుతున్నారు. అధికారికంగా ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించాలి. ఎవరైనా బిల్లు లేకుండా రోడ్డు మీద దొరికితే, ఓ సూపర్‌వైజర్ వచ్చి ఆన్‌లైన్ బిల్లు ఇచ్చి, డబ్బు కూడా ఆన్‌లైన్ పేమెంట్ చేసుకుంటారు. దీనివల్ల అధికారికంగా నిర్ణయించిన సీనరేజీనే వసూలు చేయవలసి ఉంది. రోడ్ అండ్ బల్లాస్ట్ మెటీరియల్ క్యూబిక్ మీటరుకు రూ.90, టన్నుకు రూ.60 సీనరేజీ చెల్లించాలి. ఆర్డినరీ ఇసుకకు క్యూబిక్ మీటరకు రూ.100, టన్నుకు రూ.60 చెల్లించాలి. క్వార్ట్జ్ టన్నుకు రూ.90, సున్నపురాయి మూడు కేటగిరీలలో ఉంది. లేటరైట్ మెట్రిక్ టన్నుకు నాలుగు రకాలుగా ఉంది. అల్యూమినియంలో ఉపయోగించేది టన్నుకు రూ.200, ఇతర అవసరాలకు ఉపయోగించేది టన్నుకు రూ.100, లైమ్‌స్టోన్ టన్నుకు రూ.90, లైమ్‌షెల్‌కు టన్నుకు రూ.120 వసూలు చేయాలి. ఇలా ఈ ప్రాంతంలో లభ్యమయ్యే వాటికి ప్రభుత్వం ధరలు నిర్ణయించింది. ఆ ప్రకారమే వసూలుచేయాలి. ఇక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వసూళ్లు మొదలయ్యాయి.



రాజమహేంద్రవరం నాలుగో బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన మైనింగ్ చెక్‌పోస్టు

అనపర్తిలో దారుణ హత్య

- భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త
- అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు
- అనపర్తిలో ఘటన



సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

సబ్ కా సాత్, సబ్ కా వికాస్.. ఇదే బీజేపీ విధానం

- ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ
- పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26 : సబ్ కా సాత్, సబ్ కా వికాస్ బీజేపీ విధానం అని బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఎలాంటి అవినీతి మరక లేకుండా ప్రజాహితంగా, రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా స్థాయి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పురందేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు జరగడం సర్వసాధారణమని, రాష్ట్రంలో ఆరు సంవత్సరాలకు ఒకసారి సంపూర్ణంగా మళ్లీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. 2014లో భారతీయ జనతా పార్టీ 11 కోట్ల మంది కొత్త సభ్యులను నమోదు చేసి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు. చైనాలో కమ్యూనిస్టు పార్టీ 9 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలో పెద్ద పార్టీగా ఉండేదని, దాన్ని బీజేపీ అధిగమించిందని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 18 కోట్ల మంది పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. రాష్ట్రంలో 2014లో 28 లక్షలకు పైగా సభ్యత్వం తీసుకోగా, 2019లో మరో 8 లక్షల మందికి పైగా నమోదయ్యారని వివరించారు. ఇప్పుడు కూడా పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చేయడంలో కార్యకర్తలు కృషి చేస్తారని అన్నారు. సీఏఏ, ట్రిపుల్ తలాక్ రద్దు, వక్ఫ్‌బోర్డు సవరణలు వంటి అనేక నిర్ణయాలను బీజేపీ ప్రభుత్వం తీసుకుందని పురందేశ్వరి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పురందేశ్వరి ముఖ్య నాయకులతో సభ్యత్వాల నమోదుపై అంతర్గత సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, ఆగస్టు 26: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మార్కొండపాడులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్లు నిర్మించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నామనారు. సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేను గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, సర్పంచ్ శివపోసి, కె.హరికృష్ణ, బండి రామకృష్ణ, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నుంకవల్లి రమేష్, జనసేన మండలాధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి, ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్, తాళ్లూరి ప్రసాద్, మద్దిపాటి వీరరాఘవులు, కేకే గంగాధరరావు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాటాలకు షీల్డు తప్పనిసరి'



దేవరపల్లిలో ఎలక్ట్రానిక్ కాటా షీల్డును పరిశీలిస్తున్న అధికారి ప్రసాద్

దేవరపల్లి, ఆగస్టు 26: ఎలక్ట్రానిక్ కాటాలు వాడేవారు ప్రతి ఏటా తప్పనిసరిగా షీల్డు వేయించుకోవాలని తూనికల కొలతల శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ డీలర్లు ఎలక్ట్రానిక్ కాటాలకు సోమవారం షీల్డు వేయించారు. ఈ సందర్భంగా జీవీ ప్రసాద్ మాట్లాడుతూ విధిగా ప్రతిఒక్కరు కాటాలకు తూకపు రాళ్లకు షీల్డు వేయించుకోవాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దేశపూర్వకంగా కాటాల్లో, తూనికల్లో తేడాలు జరిగితే చర్యలు తప్పవన్నారు.

చంద్రవరంలో రైతులకు సన్మానం



చంద్రవరంలో రైతులను సన్మానిస్తున్న దృశ్యం

చాగల్లు, ఆగస్టు 26: మండలంలోని చంద్రవరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రైతులను సన్మానించారు. ధనుకా అగ్రిటెక్ సంస్థ రైతు సదస్సు నిర్వహించి ప్రస్తుతం వరి పంటను ఆశించిన తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. సంస్థ శాస్త్రవేత్త జె.శంకర్ మాట్లాడుతూ మొవ్వ పురుగు, దుబ్బు కుళ్లు, మాగుడు నివారణకు మోర్టార్ వాడాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ మద్దిపాటి వీరారాఘవులు సహా పలువురు రైతులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో అగ్రిటెక్ మేనేజర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

దేవరపల్లి, ఆగస్టు 26: మండలంలోని యర్నగూడెంలో కిడ్నీవ్యాధితో బాధపడుతున్న బిరుదుగడ్డ రవీంద్రకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. కిడ్నీ మార్పిడికి ఎమ్మెల్యే సహకారం ద్వారా, సభ్యుల ఆర్థిక సహకారం అందజేస్తామని మానవత జిల్లా కన్వీనర్ కె.శిరాజు రాజ్‌కుమార్, మండల చైర్మన్ బండి సూర్యప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో బళ్లా సూర్యచక్రం, పప్పు వెంకటరామారావు, ఉప్పల అయ్యప్ప, తీగల లక్ష్మీనారాయణ, యలమాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఆగస్టు 26: కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు చైర్పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు కమిషనర్ కె.డానియేల్ జోసఫ్ తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని చెప్పారు.

సేవా మూర్తికి ఘన నివాళి

» పలుచోట్ల మదర్‌థెరిస్సా జయంతి.. సేవా కార్యక్రమాలు

కొవ్వూరు, ఆగస్టు 26: కొవ్వూరులోని రోడ్ కం రైలు బ్రిడ్జి టోల్‌గేటు సెంటర్‌లో మదర్‌థెరిస్సా ఆటో ఓనర్స్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మదర్‌థెరిస్సా 114వ జయంతిని నిర్వహించారు. దీనికి ముఖ్య ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ముఖ్యఅతిథులుగా విచ్చేసి మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, యనమదల సుబ్రహ్మణ్యం, అనపర్తి గోపాలకృష్ణ, నామాన పరమేశ్వరరావు, దాసరి రామకృష్ణ, యాజవరపు శ్రీనివాస్, సీఐ పి.విశ్వం పాల్గొన్నారు. కొవ్వూరు మెయిన్‌రోడ్‌లోని థెరిస్సా విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.సోమరాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దుల సత్యనారాయణ, మట్టే ప్రసాద్, మన్యం బుల్లిబాబు, వలివేటి ప్రసాద్, వంకాయల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో థెరిస్సాకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు: చాగల్లులో మదర్ థెరిస్సా విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించి దాతల సహకారంతో భవిత కేంద్రం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇద్దరు దివ్యాంగులకు వైద్యసేవల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. మదర్ థెరిస్సా సేవాసమితి అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్, కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో దివ్యాంగులకు దుప్పట్లు పంచుతున్న దృశ్యం

తాళ్లపూడి: పైడిమెట్ట గ్రామంలో నందన ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మదర్ థెరిస్సా జీవిత విశేషాలను వివరించారు. అల్బేనియా దేశానికి చెందిన రోమన్ కాథలిక్ సన్యాసిని అని, భారత దేశంలో ఎన్నో చారిటీలు, మిషనరీలు ఏర్పాటు చేశారని, ఆమె నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కె అలీ, కె.చంద్రశేఖర్, ప్రతాప్‌కుమార్, డి.రాజు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



నిడదవోలు: సమిశ్రగూడెంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: సమిశ్రగూడెం శాంతి సెంటరులో నిర్వహించిన మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ విచ్చేసి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటి వారికి సాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యజించిన త్యాగమూర్తి మదర్ థెరిస్సా అని, ఆమె వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకుని అందరూ తోటివారిని ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, గజ్జరపు శ్రీరమేష్, ఉప్పులూరి రామ్మోహనరావు, గోగిన శ్రీనివాస్, ఎండీ అక్రమ్, ముప్పిడి నరసింహమూర్తి, రాజారత్నం, నిమ్మగడ్డ హరిబాబు, వీరబాబు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో థెరిస్సాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొవ్వూరులో హాల్ట్ ఇవ్వాలి

» ఎంపీ పురందేశ్వరికి రైల్వే పరిరక్షణ సమితి వినతి

కొవ్వూరు, ఆగస్టు 26: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ ముందు నిలిపే రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరణ చేయాలని రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి కొవ్వూరు రైల్వేస్టేషన్ ప్రాముఖ్యతను వివరించారు. 2023 సెప్టెంబరు నుంచి రైళ్ల హాల్ట్ కోసం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. విల్సన్‌రాజు మాట్లాడుతూ ద్వారపూడి, అనపర్తి స్టేషన్లు, కొవ్వూరు స్టేషన్ మధ్యనున్న అంతరాన్ని ఎంపీకి తెలియజేశారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి సభ్యులు కె.వెంకటరమణ, గారపాటి మోహనరావు, హజీబు జగన్నాథరావు, పడాల సుబ్బారెడ్డి, కొండపల్లి రత్నసాయి, గణేష్, రమేష్, పిక్కి నాగేంద్ర, టీడీఎల్ ప్రసాద్, వల్లూరి రవి, వైకె శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జనసేన నాయకులు

పలు అభివృద్ధి పనులకు వినతి

దేవరపల్లి, ఆగస్టు 26: నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతిపత్రాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో నిడదవోలు-జంగారెడ్డిగూడెం ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా ఉందని, రోడ్డు నిర్మించాలని, ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల్లోని పెండింగులో ఉన్న వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అచ్యుత సత్యనారాయణ, నాయుడు దుర్గాప్రసాద్, కాట్నం గణేష్, దాచవరపు నరసింహమూర్తి, అనిశెట్టి గంగరాజు, గణపతి, చప్పటి శివనాగప్రసాద్, పోతుల కనకరాజు పాల్గొన్నారు.

అనపర్తిలో దారుణ హత్య

» భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త

» అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు





మృతురాలు అరుణకుమారి (ఇన్‌సెట్లో) ఫైల్ ఫొటో

అనపర్తి, ఆగస్టు 26: అనపర్తిలో ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో డంబెల్‌తో తలపై మోది హతమార్చాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన తుపాకుల సాయి, అరుణకుమారి (30)లకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు సుమారు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం అనపర్తి వచ్చి జీవనం సాగిస్తున్నారు. వీరికి పది, ఏడేళ్ల వయసున్న ఆడపిల్లలు ఉన్నారు. సాయి కోడుగుడ్ల వ్యాన్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచు మద్యం తాగొచ్చి చిత్ర హింసలకు గురిచేస్తున్నాడు. సోమవారం ఇద్దరికీ ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న సాయి ఎక్సర్‌సైజ్ చేసే డంబెల్‌తో తలపైన తీవ్రంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై ఆమెకు అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ శివగణేష్, ఎస్‌ఐ శ్రీనునాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రైలు నుంచి జారిపడి ఒడిస్సా వాసి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సామర్లకోట రైల్వే పోలీసులు

అనపర్తి, ఆగస్టు 26: అనపర్తి రైల్వేస్టేషన్‌లో సోమవారం తెల్లవారు జామున రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. సామర్లకోట జీఆర్పీ ఎస్‌ఐ బి.లోవరాజు వివరాల ప్రకారం సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపునకు ప్రయాణిస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి ఓ ప్రయాణికుడు జారి పడ్డాడని అనపర్తి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ బి.శ్రీధర్ సమాచారం మేరకు అనపర్తి చేరుకున్నామని అప్పటికే ఆ వ్యక్తి మృతిచెంది ఉన్నాడన్నారు. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ప్రకారం ఒడిస్సాకు చెందిన చిత్రాసేన్ దాస్(42)గా గుర్తించి బంధువులకు సమాచారం అందించామన్నారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు. సోమవారం రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయానికి వెళ్లిన ఆయన రాబోయే గోదావరి పుష్కరాలకు చేపట్టవలసిన అభివృద్ధి పనులు, నగరంలోని సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టవల్సిన చర్యలు, ఎంపీ సహకారం తదితర అంశాలపై చర్చించారు.



కొవ్వూరులో నగర సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం



చాగల్లులో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



ఉండ్రాజవరంలో దుర్గేష్, శేషారావులను సత్కరిస్తున్న దృశ్యం

కృష్ణ..ముకుంద..మురారి

» వేణుమాధవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

» పలుచోట్ల ఉట్టికొట్టి యువత సంబరాలు

» రాధాకృష్ణులు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

కొవ్వూరు, ఆగస్టు 26: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులో లాంచీలరేవు వద్ద శ్రీరామానంద గౌడీయామఠంలో మఠాధిపతి త్రిదండి శ్రీమద్భక్తి విబుధ వామన మహారాజ్ (బాల కృష్ణ ప్రభువు) ఆధ్వర్యంలో రాధాకృష్ణులకు విశిష్ట పూజలు, భజనలు చేశారు. అనంతరం మఠం నుంచి భక్తులు కోలాటం చేస్తూ పట్టణ పురవీధుల్లో నగర సంకీర్తన జరిపారు. ఆరికిరేవులలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గుత్తా వెంకటకృష్ణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహించారు. పసుపులేటి మెహర్ బాబా కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సాహంగా యువత ఉట్టికొట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు యనమదల రామరావు, చావా వెంకటరావు, యనమదల సుబ్రహ్మణ్యం, చావా రంగారావు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి విద్యాలయంలో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆటపాటలతో అలరించారు.

నిడదవోలు: మండలంలోని శంకరాపురంలో దివ్యాంగుల కేంద్రం హృదయాలయంలో నిర్వాహక సభ్యురాలు విశాలాక్షి చొరవతో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులైన అనన్య, రోహిత్‌లు కృష్ణుని వేషధారణలో అలరించారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఇస్కాన్ ప్రతినిధి శ్యామ్‌రంగ.. కృష్ణుడి విగ్రహానికి పూజల అనంతరం క్షీరాభిషేకం చేశారు. మానవాళికి భగవద్గీతను బోధించి ప్రతి మనిషి ఎలా జీవించాలో తెలిపిన మహాజ్ఞాని కృష్ణుడు అని అన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో రాధాగోపినాథ్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. బీసీ కాలనీలోని శ్రీకృష్ణాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిపిన వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. సిద్ధా కోటేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పలపాటి కళావతి, తీగల బలరామయ్య, టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం, కరుటూరి శ్రీనివాస్, తంగెళ్ల మునేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త, తాడిపర్రు గ్రామాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహాలను బ్యాండుమేళాలు, బాణసంచాతో వైభవంగా నిర్వహించారు. వివిధ వేషధారణలు వేశారు. ఉట్టి కొట్టిన వారికి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యారావుపాలెం, కాల్దరి గ్రామాల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని కమిటీ సభ్యులు సత్కరించారు.

పెరవలి: స్థానిక కళ్యాణ మండపంలో హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో దీపికా సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. పెరవలి, తణుకు పరిసర ప్రాంతాలకు చెందిన 27 పాఠశాలలకు సంబంధించిన 1008 మంది విద్యార్థులతో 18 అధ్యాయాల్లో 700 శ్లోకాలను ఈ సందర్భంగా పఠించారు. ఈ సందర్భంగా 27 మంది శ్రీకృష్ణుడి వేషధారణలోనూ, 27 మంది రాధ వేషధారణలోనూ అలరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.



నిడదవోలు: శంకరాపురం హృదయాలయంలో కృష్ణాష్టమి వేడుకలు



దేవరపల్లిలో ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు



పెరవలిలో భగవద్గీత పారాయణంలో పాల్గొన్న శ్రీకృష్ణ, రాధ వేషధారులు

ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

డివిజన్ కార్యదర్శిగా సురేష్



రాజానగరం, ఆగస్టు 26: ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ సర్వసభ్య సమావేశం డివిజన్ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ అధ్యక్షతన రాజానగరం సెక్షన్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ కార్యదర్శిగా కందికట్ల సురేష్(సీనియర్ అసిస్టెంట్)ను డివిజన్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి నిరంతర కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు. సమావేశంలో ఈపీడీసీఎల్ సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ జీజే సుధాకర్, జిల్లా అడ్వైజర్ డి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వి.కాంతారావు, కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, డివిజన్ గౌరవాధ్యక్షుడు తుమ్మల తాతారావు, సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో

మాస్టర్‌మైండ్స్‌కు ఉత్తమ ర్యాంకులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: సీఎంఏ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని మాస్టర్ మైండ్స్ రాజమహేంద్రవరం బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ బి.సోమశేఖర్ తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో ఆలిండియా స్థాయిలో 42 ర్యాంక్‌ను కె.తరుణ్ పవన్‌కుమార్ రాజు, సీఎంఏ ఫైనల్‌లో 37వ ర్యాంక్‌ను ఎస్.వీరవెంకట సుబ్రహ్మణ్యం సాధించారని తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ అకడమిక్ ప్రణాళికతో విద్యార్థులు కామర్స్ కోర్సుల్లో ఆలిండియా స్థాయిలో ర్యాంక్‌లు సాధించడానికి దోహదపడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మణికుమార్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు

దివాన్‌చెరువు, ఆగస్టు 26: రాజానగరం మండలం కొండగుంటూరుకుచెందిన పెంటగట్ల మణికుమార్‌కు బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు లభించిందని ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో సోమవారం మదర్‌సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాదరావు నిర్వహించిన ఒక కార్యక్రమంలో తనకు అంబేడ్కర్ జాతీయ అవార్డును అందజేశారన్నారు. తాను అనేక మార్లు రక్తదానం చేయడంతో బాటు నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు అందజేశారని మణికుమార్ తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26: పేదవారి ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌కు రాజమహేంద్రవరం ఆవరోడ్డు బాలాజీపేటకు చెందిన ఏఎస్ గణేశ్వరరావు రూ16,500 విరాళం ఇచ్చారు. సోమవారం స్థానిక తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకుడు కంటిపూడి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు మానవత్వం కలిగిన వారంతా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని, శుభ కార్యాలు, పెళ్లిలు, పుట్టిన రోజులప్పుడు అన్నదానం చేయాలనుకునేవారు అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కంటిపూడి శ్రీనివాస్, మస్తాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాం నెం.4కి వెళ్లే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఎస్‌ఐ కె.మావుళ్లు తెలిపారు. సదరు వ్యక్తికి సుమారు 40ఏళ్లు ఉంటాయని.. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.94910 03239కు సమాచారం ఇవ్వాలని కోరారు.